


సెలవు రోజయినా కాస్త చల్లటిగాలి పీల్చుకుందామని శంకర్రావు, నారాయణ మూర్తి పబ్లిక్‌గార్డెన్స్‌లోకి వెళ్తుండగా "గుడ్ మార్నింగ్ లెక్చరర్ సాబ్!" అన్న మాట విని ఆగిపోయారు,

"ఓరి నువ్వట్రా! ఎవరో స్టూడెంటు అనుకున్నాను." అన్నాడు శంకర్రావు.

"ఈ మధ్య నీ దర్శనాలే కరువయ్యాయి. బొత్తిగా నల్లపూసైపోయావ్. ఏమిటి కథ." అన్నాడు గోపీకృష్ణ.

"పరీక్షలు దగ్గిర పడుతున్నాయి గదా!" నవ్వుతూ అన్నాడు శంకర్రావు.

"అవునవును. పుస్తకాలు ముందు చదివేవాడు ఉపాధ్యాయుడు. తర్వాత చదివేవాడు విధ్యార్థి అని గురువుగారు నారాయణరెడ్డి ఆ మధ్య ఏదో మీటింగ్ చెప్పినట్లు గుర్తు." అన్నాడు గోపీకృష్ణ.

"చార్లీవోయ్ నీ జోక్. నీ బిజినెస్ ఎలా వుంది?"

"మూడు పువ్వులు ఆరు కాయలు. సారీ ముప్పై పువ్వులు అరవై కాయలు, అంటే అన్నీ కవల కాయలన్నమాట. అన్నట్లు వీడెందుకు మూగనోము పట్టాడు." అన్నాడు నారాయణ మూర్తిని వుద్దేశించి.

"వాడికి ఆఫీసులో ఇనస్పెక్షన్. మన మూడ్‌లో లేడు. ఐ. ఆర్. పేరాలకి ఎలా రిప్లైస్ ఇవ్వాలా అని ఆలోచిస్తూ వున్నాడు." అన్నాడు శంకర్రావు నవ్వుతూ.

"మూడ్ బాగా లేకపోతే బార్‌కి వెళ్ళాలి గాని, గార్డెన్‌కి వెళ్తే ఏం లాభం?" అన్నాడు గోపీకృష్ణ.

"నువ్వు ఆహ్వానించాలి గాని మేం రెడీయే." అన్నాడు శంకర్రావు.

ముగ్గురూ బార్‌లో కూర్చున్నారు. గ్లాసులు ఖాళీ అవుతుంటే, ప్లేట్లు ఎగిరి పోతున్నాయి.

"ఏరా! మూర్తీ. నీ మూడ్ దారిలో పడిందా లేదా!" అని జోక్ చేశాడు కోపీకృష్ణ.

"మీ రనుకుంటున్నట్లు ఆఫీస్ వ్యవహారాలతో నా మూడ్ చెడిపోలేదు. మా ఆఫీసులో పనిచేసే ప్రమీల గురించి ఒక విషయం రూఢిగా తెలిసింది. అప్పట్నుంచి నా కెందుకో బాధగా వుంది." అన్నాడు మూర్తి.

"ఎవరా ప్రమీల? ఏమా కథ?" అన్నాడు గోపీకృష్ణ.

"మా సెక్రటరీకి కొంచెం మదపిచ్చి వుందిలే. కాస్త ఎర్రగా బుర్రగా కన్పిస్తే చాలు పనులన్నీ వదిలేసి ఆ పిల్ల వెంట తిరుగుతూ వుంటాడు. ప్రమీల మాత్రం కాస్త బెట్టుగానే వుంది. మా సెక్రటరీ వలలో పడలేదు. ఆ కోపం మనసులో పెట్టుకొని ఆమె ప్రమోషన్ దగ్గర పేచీ పెట్టాడు, లోగడ ఆమె పనిచేసి వచ్చిన ఆఫీసులో కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్సు సరిగా లేవని. లాస్ట్ ఇయ్యర్ రిపోర్ట్సు బాగా వుంటే ప్రమోషన్ ఇవ్వవచ్చు. లాస్ట్ ఇయ్యర్ రిపోర్ట్సు రాయవలసింది అతనే. రాస్తాను గాని.... అంటూ తన కోరిక తీర్చమన్నాడు. ప్రమీల సెక్రటరీకి లొంగిపోయిందని అంతా అనుకుంటుంటే నేను నమ్మలేదు. కాని ఆమెకు ప్రమోషన్ రావడం నాకు అనుమానం వచ్చింది. ఇంతక్రితమే ఇద్దరూ రాయల్ హోటల్లోంచి బైటికొచ్చి ఆటోలో వెళ్ళడం కళ్ళారా చూశాను." అన్నాడు మూర్తి.

"ఓస్ ఇంతేనా. పాత కథే. ఇటు

వంటివి ఈ కాలంరో మామూలే." అని చప్పరించి పారేశాడు గోపీకృష్ణ.

"మామూలే అనుకో. గతిలేక లొంగిపోవడం సర్వ సామాన్యం. కాని ప్రమీల అంత గతిలేనిది కాదే. అమె ఫాదర్ గూడా ఆఫీసరే. మరి అటువంటప్పుడు అంతగా దిగజారిపోయి ప్రమోషన్ సంపాదించుకో వలసిన అవసరం ఏమిటి?" అని ప్రశ్నించాడు మూర్తి.

"డబ్బు నాయనా! డబ్బు. డబ్బు కోసం...." అన్నాడు గోపీకృష్ణ.

"సరే, ప్రమీల డబ్బుకోసం దిగజారిందనుకో. మరి శోభారాణి ఎందుకు పరెండరైందో చెప్పండి. సరైన సమాధానం చెప్తే బిల్లు నేనే పేచేస్తాను." అన్నాడు శంకర్రావు.

"ముందా శోభారాణి ఎవరో, ఆ కథ ఏమిటో చెప్పు?" అన్నాడు గోపీకృష్ణ కుతూహలంతో.


"మా కాలేజీలో ఎమ్ ఫిల్ చదువుతూ వుండేది శోభారాణి. ఆమె మీద కన్నువేశాడు హిస్టరీ హేడ్ రామరాజు. అందుకే స్పెషల్ ఇంట్రెస్ట్ తీసుకునేవాడని వదంతి. బాచ్‌లర్ కాబట్టి తిప్పలు పడుతూ వుంటాడులే అని కాలీగ్సు నవ్వుకునేవళ్ళు. అయితే రామరాజు విసిరిన వలలో పడలేదు శోభారాణి. తను కాలేజీ బ్యూటీనని గర్వం ఆమెకు. రామరాజు ఎప్పుడో మంచి మూడ్‌లో వున్నప్పుడు అమె జోక్ చేస్తే, చెంపమీద కొట్టినట్లు అవహేళన చేసింది. రామరాజు నవ్వులపాలయ్యాడు. అదంతా ఒక కథ.

"సరే ఈవిడగారు రిసెర్చి ఎలా చేస్తుందో నేనూ చూస్తాను" అని శపథం చేశాడు.

ఫస్ట్‌క్లాసు రాకపోతే ఇంకేం రిసెర్చి చేస్తుంది నా ముఖం. రామరాజుని ఎంత కాకా పట్టినా రవ్వంతయినా మారలేదనీ, అమె తనకి లొంగిపోవాలని పట్టు పట్టాడని గుసగుసలు బయల్దేరాయి. ఫస్టుక్లాస్ రాకపోయినా ఫరవాలేదు గాని అమె లొంగిపోయేది కల్ల అని గూడా అనుకున్నారు.

తర్వాత శోభారాణి రామరాజు ఇంటికి ఒక రోజు రాత్రి కారులో వెళ్ళి గంటసేపు వుందని ఒక విద్యార్థి పసిగట్టాడు. ఎలాగైతేనేం ఆమెకు క్లాస్ వచ్చింది. ఇప్పుడు రిసెర్చి చేస్తూవుంది." అంటూ ముగించాడు శంకర్రావు.

కొంచెంసేపు ఎవరూ మాట్లాడలేదు. తర్వాత శంకర్రావే అన్నాడు. "ఇప్పుడు చెప్పండి. శోభారాణి ఎందుకు లొంగిపోయింది? ఆమెకేం తక్కువ? అమె తండ్రి లక్షాధికారి. ఈవిడ చదివి వుద్యోగాలు చేసి కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితులేం లేవు. కాని ఫస్ట్ క్లాస్ కోసం శీలాన్ని సమర్పించింది. ఎందుకు? చెప్పండి?"




గోపీకృష్ణ నవ్వి "నువ్వొట్టి వెధవాయి వోయ్." అన్నాడు.

సీరియస్‌గా చూశాడు శంకర్రావు. అయోమయంలో పడిపోయాడు నారాయణ మూర్తి.

"నీ జేబులో డబ్బుందా?" అని ప్రశ్నించాడు గోపీకృష్ణ.

"ఎందుకూ?" అన్నాడు శంకర్రావు.

"బిల్లు పే చెయ్యడానికి." నవ్వాడు గోపీకృష్ణ.

"ముందు సమాధానం చెప్పు."

"అయితే విను. రామరాజుకి శోభారాణి లొంగిపోయి క్లాస్ తెచ్చుకుంది అనేది వట్టి పుకారు మాత్రమే." అన్నాడు గోపీకృష్ణ.

"నో...." ఆవేశంగా అన్నాడు శంకర్రావు.

"నువ్వు తగ్గరా నాయనా. చెప్పింది విను. ఆ రోజు రాత్రి శోభారాణివాళ్ళ కారు రామరాజు ఇంటికి వెళ్ళిన మాట నిజమే. కాని అందులో వెళ్ళింది శోభారాణి కాదు." సిగిరెట్ వెలిగించి గుప్పుగుప్పున పొగ వదుల్తూ అన్నాడు గోపీకృష్ణ.

"మరి ఎవరు?" మూర్తి కుతూహలంతో ప్రశ్నించాడు.

"శోభారాణి తండ్రి."

"ఆఁ...." అంటూ నోరు తెరిచాడు శంకర్రావు.

"శోభారాణికి బదులు వాళ్ళ నాన్న రావడం చూసి అదిరిపడ్డాడు రామరాజు. తన కూతురికి ఫస్ట్ క్లాస్ రాకపోతే నీకు యీ భూమ్మీద నూకలు చెల్లినట్లే అని హుంకరించాడు. పట్టపగలు రోడ్డు

మీద మర్డర్ చేయిస్తా కాసుకో అని బెదిరించాడు ఆరోజు నుంచి శోభారాణిని చూస్తేనే చాలు మృత్యు దేవతని చూసినట్లు హడలి పోయేవాడు." అంటూ గోపీకృష్ణ అసలు కథ బైటపెట్టాడు.

"నీకు ఈ కథంతా ఎలా తెలుసు?" సందేహిస్తూ అన్నాడు శంకర్రావు.

"అప్పుడు వాళ్ళ కారుడ్రైవర్‌గా పనిచేసినవాడు ఇప్పుడు మా దగ్గరే వున్నాడు. వాడు చెప్పాడు ఈ కథంతా. కావాలంటే వాడిని పిలిపించి నీ ముందు చెప్పిస్తా." అన్నాడు గోపీకృష్ణ.

"నో.... నో' నాట్ నెససరీ...." అన్నాడు శంకర్రావు.

అనుకున్నట్లే శంకర్రావు బిల్లు పే చేశాడు.

"ప్రొద్దునే ఎవడి మొహం చూశానో పందెం ఓడిపోయాను." అన్నాడు శంకర్రావు ఏడవలేక నవ్వుతూ.

"రవీలో భోం చేసి 'డాన్'కి వెళ్దాం." అని ప్రపోజల్ పెట్టాడు గోపీకృష్ణ.

"సారీ గురూ, అర్జంట్ పనివుంది," అంటూ ఆటోలో వెళ్ళిపోయాడు శంకర్రావు.

"శంకర్రావు పీనాసి వెధవ. ఈ రోజు బిల్లు పే చేసినందుకు ఎన్నిరోజులు అన్నం మానేస్తాడో." నవ్వుతూ అన్నాడు మూర్తి.

గోపీకృష్ణ అతని నవ్వుతో శృతి కలిపి "అందుకే గదా! వాడిని బోల్తా కొట్టించాను," అన్నాడు.

"అంటే నువ్వు చెప్పిందంతా నిజం కాదా?" ఆశ్చర్యపోతూ అన్నాడు మూర్తి.

"వాడు చెప్పిందంతా నిజం అని నువ్వు నమ్మావా?" అన్నాడు గోపీకృష్ణ.

"అవును."

"వాడు ఈ కథ లోగడ ఒకసారి నాకే చెప్పాడు. కాని అందులో శోభారాణి బదులు సావిత్రి అని చెప్పాడు. బహుశా అది వాడు మర్చిపోయి వుంటాడు. వాడికి ఇలా కథలు కల్పించి చెప్పడం, ఏదొక చిక్కు ప్రశ్న వేసి మనతో బిల్లు పే చేయించడం బాగా అలవాటు. అందుకే ఈ రోజు వాడి ఆట కట్టించాను...." అన్నాడు గోపీకృష్ణ నవ్వుతూ.

"ఓరి పిడుగా. అసాధ్యుడివి. ఇంకేం ఇక నువ్వూ కథలు కల్పించడం.... సారీ రాయడం మొదలుపెట్టు," అన్నాడు నారాయణమూర్తి.

